క్లుప్తంగా

'కల్యాణలక్ష్మి' దరఖాస్తుల పరిశీలన

కోస్గి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదల్లో ఆర్థిక భరోసాను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మండల తహసీల్దార్ బక్క శ్రీనివాసులు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 16 మంది కల్యాణలక్ష్మి, షాది ముబారక్ పథకం లబ్ధిదారులను స్వయంగా పరిశీలించారు. ఎలాంటి అవకతవకలు లేకుండా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సినియర్ అసిస్టెంట్ భీమమ్మ, జూనియర్ అసిస్టెంట్ జరీనా తదితరులు ఉన్నారు.

ఫిజియోథెరపీని సద్వినిగించుకోవాలి



మరికల్: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో నిర్వహించే ఫిజియోథెరపీని అంగవైకల్యం ఉన్న పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ మీర్జా కలిముల్లా సూచించారు. మంగళవారం నిర్వహించిన ఫిజియోథెరపీ క్యాంపులో అంగవైకల్యం కలిగిన 0–19 ఏళ్ల పిల్లలకు ఫిజియోథెరపీ చేయించారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ క్యాంపును దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాంరెడ్డి, డాక్టర్ సంధ్యరాణి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొత్తపల్లి: మండలంలోని నిడ్జింత–మద్దూరు మధ్యలో వాగు పరిసరాల్లో వరద పరిస్థితులను డీఎస్పీ లింగయ్య, కోస్గి సీఐ సైదులు పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండి వాగులు పొంగి పొర్లుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వాగులు, చెరువులు కుంటల దగ్గరకి పిల్లలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎవరైనా వరద నీటిలో చిక్కుకున్నా, ప్రమాదకర పరిస్థితులు ఎదురైనా వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కోస్గి సీఐ సైదులు, మద్దూరు ఎస్ఐ విజయ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు థర్మామీటర్ వితరణ



దామరగిద్ద: మండలంలోని మద్దెల్‌బీడ్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం బాపన్‌పల్లికి చెందిన ఆవుటి గంగాధర్ ఆటో సెన్సార్‌తో కూడిన థర్మామీటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శంకర్ మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం అందించిన థర్మామీటర్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యుడు రఘు, ఉపాధ్యాయులు శశిధర్, సాయప్ప, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



మక్తల్/కోస్గి/నర్వ: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలో ఫొటో, వీడియో గ్రాఫర్లు లూయిస్ జేఎం డాగ్యూరె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలు అర్పించారు. మనిషి జీవితంలో మధుర క్షణాలను పదిలంగా భద్రపరిచేది ఫొటోగ్రాఫే అన్నారు. డిజిటల్ యుగంలో సెల్‌ఫోన్ రావడంతో ఫొటో స్టూడియోలకు గిరాకీ లేకుండా పోయిందని ప్రభుత్వం స్పందించి ఫొటోగ్రఫి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

మద్దూరు: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మద్దూరు మండల తహసీల్దార్ మహేష్ గౌడ్‌ను ఉత్తమ అవార్డుతో నారాయణ పేట జిల్లా కేంద్రంలో కలెక్టర్ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందించారు. ఈ సందర్భంగా మంగళవారం మద్దూరు మండల తహసీల్దార్‌ను సిబ్బంది శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది అమరేందర్ శెట్టి, అమరేందర్, తిరుపతయ్య, పవన్ కుమార్, మహేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో 'అంగన్‌వాడీలు'

- అసౌకర్యాల నడుమ పూర్వ ప్రాథమిక విద్య
- నూతన భవనాలు మంజూరుకే పరిమితం
- మండలంలో మొత్తం 68 కేంద్రాలు



కంసాన్‌పల్లిలో ఒకే అద్దె భవనంలో రెండు కేంద్రాల నిర్వహణ



ఇరుకు గదిలో అంగన్‌వాడీ కేంద్రం

దామరగిద్ద: చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందించేందుకు మహిళ శిశు సంక్షేమ శాఖ ద్వారా కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవనాలు లేక అసౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి. మండలంలో మొత్తం క్యాతన్‌పల్లి, కాన్‌కుర్తి, దామరగిద్ద సెక్టార్‌లుగా విభజించారు. ఆయా సెక్టార్‌ల పరిధిలో మొత్తం 62 కేంద్రాలుండగా ఇటీవల ఆశన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామానికి కొత్తగా అంగన్‌వాడి కేంద్రం మంజూరు కావడంతో మొత్తం 63 కేంద్రాలున్నాయి. కాగా వీటిలో సొంత భవనాలు 21 కేంద్రాలకు ఉండగా మిగిలిన 42 కేంద్రాల్లో 27 కేంద్రాలు గ్రామ పంచాయతీ, డ్వాక్రా, పాఠశాల గదుల్లో కొనసాగుతుండగా 15 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వం కొత్తగా ఈజీఎస్ పీఆర్ శాఖల ద్వారా సొంత భవనాలు మంజూరు చేసినా స్థల ప్రభావం, ప్రారంభించిన వాటికి బిల్లులు అందక పోగా అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఇటీవల మద్దెల్‌బీడ్ గ్రామానికి సొంత భవనం మంజూరు చేసినా స్థల ప్రభావంతో నేటికీ నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు.

కేంద్రాల్లో వసతుల కొరత

సొంత భవనాలు లేకపోవడంతో అద్దెభవనాల్లో, ఇతర ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేక సిబ్బంది ఇబ్బందుల మధ్య కేంద్రాలను నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు విశాలమైన గదులతో పాటు వంట గది, స్టోర్ రూం, సరైన వెంటిలేషన్, మరుగుదొడ్లు మూత్రశాలలు, యాండ్‌వాస్ వంటి సదుపాయాలు లేక పోగా అన్ని ఒకే గదిలో నిర్వహిస్తూ కేంద్రాలను నెట్టుకొస్తున్నారు. ఇటీవల అన్నాసాగర్ రెండో కేంద్రం శిథిలావస్థలో ఉన్న భవనంలో కొనసాగుతుండగా అద్దె భవనంలోకి మార్చారు. కంసాన్‌పల్లి గ్రామంలోని సొంత భవనం వర్షాలకు కారుతుండడంతో అద్దె భవనంలో కొనసాగుతున్న మూడో అంగన్‌వాడి కేంద్రంతో కలిపి నిర్వహిస్తున్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు

మండలంలోని మూడు సెక్టార్‌ల పరిధిలో మొత్తం 63 అంగన్‌వాడి కేంద్రాలున్నాయి. వీటిలో 21 కేంద్రాలకే సొంత భవనాలున్నాయి. సొంత భవనాలు లేని మిగిలిన కేంద్రాలు వివిధ ప్రభుత్వ భవనాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సొంత భవనాలు మంజూరైన చోట స్థల కేటాయింపులు జరగక పోవడంతో నిర్మాణాలు చేపట్టలేదు. ఇబ్బందులు లేకుండా కేంద్రాలు కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నాం.

–వెంకటేశ్వరమ్మ, ఇన్‌చార్జి సీడీపీఓ, మద్దూర్ ప్రాజెక్టు

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసులు

నారాయణపేట: సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించబడునని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కారం చేసుకోవాలని జిల్లా జడ్జి బోయ శ్రీనివాసులు సూచించారు. నారాయణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన పోలీస్ అధికారుల సమావేశంలో జిల్లా జడ్జి ఈ లోక్ అదాలత్ సేసేవలపై పలు సూచనలు చేశారు. యాక్సిడెంట్ కేసులు, కొట్టుకున్న కేసులు, చీటింగ్ కేసులు, వివాహ బంధానికి సంబంధించిన కేసులు, చిన్న చిన్న దొంగతనం కేసులు, కరోనా సమయంలోని పెండింగ్‌లో ఉన్న కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, ఇతర రాజీ పడదగు కేసులలో ఈ నేషనల్ లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం అందుతుందన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి బి మనోజ్ కుమార్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేద్దాం



తిరుమలాపూర్ లో వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్/మద్దూరు: అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) రాష్ట్ర ప్రథమ మహాసభలను ఆగస్టు 25, 26 తేదీలలో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాములు, ప్రధానకార్యదర్శి యాదగిరి తెలిపారు. ఈ మేరకు తిరుమలాపూర్ గ్రామంలో మంగళవారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. దేశంలో మోదీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు అనుసరిస్తుందని విమర్శించారు. స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయకుండా మద్దతు ధరల గ్యారెంటీ లేకుండా చేసిందని వాపోయారు. రైతు సంక్షోభాలు, కార్పొరేట్ విధానాలు, దేశ రైతాంగ స్థితిగతులను అంచనా వేసుకుని భవిష్యత్తు కార్యక్రమాలను రూపొందించుకొనుటకు మహాసభలు దోహదపడతాయన్నారు. సభను విజయవంతం చేయడానికి జిల్లాలోని ప్రజాసంఘవాదులు, రైతులు, రైతు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బస్సప్ప, భీమేష్, రాజు, హనుమంతు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శివలింగేశ్వర ఆలయంలో పూజలు



దేవాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సింగర్ బేస్ శ్రీ శివ లింగేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పంచామృతాభిషేకం, బిల్వార్చన, విశేష పుష్పాలంకరణ, మహా మంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

ఊట్కూరు: ఊట్కూరు పెద్ద చెరువు అలుగు పారడంతో మంగళవారం గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. పాతపేట ఆంజనేయస్వామి దేవాలయం నుంచి పాయసాన్ని ప్రత్యేకంగా తయారు చేసి మేళతాళాలతో శోభయాత్ర చేపట్టి పెద్ద చెరువు అలుగు వరదలో వరద పాశాన్ని పోసి ప్రత్యేక పూజలు చేపట్టారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని మత్స్య సంపదతో మత్స్యకారులు సుఖంగా ఉండాలని రైతులు పూజలు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాస్కర్, మత్స్య సంఘం అధ్యక్షులు వెంకటరాములు, నాయకులు యజ్ఞేశ్వర్‌రెడ్డి, భరత్, రాఘవేంద్రనాయుడు, రాము, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నారాయణపేట రూరల్: ఫోటో, వీడియో గ్రాఫర్ల నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడుగా రాజేష్ ఘాట్ ఉపాధ్యక్షుడిగా భీమ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వినోద్, కాశాధికారి పుండన్, సహ కార్యదర్శి అంజి, నగేష్, గంగాధర్, మోహన్‌గా సోషల్ మీడియా ఇన్‌చార్జిగా లక్ష్మణ్, యశ్వంత్, భాను, ప్రధాన సలహాదారులుగా బస్వరాజ్, సలహా దారులుగా నర్సింహ, శివ, రాజు, విజయ్‌ను ఎన్నుకున్నారు.

నేడు చౌడమ్మ బోనాలు

నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్లలోని చౌడమ్మ గుట్టలో వెలిసిన ముత్యాలమ్మ, పగుదాలమ్మ, చౌడమ్మ బోనాలను బుధవారం నిర్వహించనున్నారు. నిర్మించని గుడిలో ఉన్న ముగ్గురమ్మలు నవాబుపేట, యన్మన్‌గండ్లతోపాటు మరో 4 గ్రామాల ప్రజలకు ఇంటి దేవతలుగా ఉన్నారు. శ్రావణమాసం చివరి వారంలో అన్ని గ్రామాలు సామూహికంగా బోనాలు నిర్వహిస్తూ వస్తున్నారు. దీంతో బోనాలకు గుట్ట సిద్ధమైంది.

దిమ్మెలు నిర్మించారు.. ట్రాన్స్‌ఫార్మర్లు మరిచారు



బురాన్‌గడ్డలో ఏర్పాటు చేసిన దిమ్మె

మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని బురాన్‌గడ్డ, కేశవనగర్ పాత కమ్యూనిటి హాల్ ముందు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చడానికి అధికారులు దిమ్మెలను ఏర్పాటు చేయించారు. అయితే దిమ్మెలు ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రం ఏర్పాటు చేయడం లేదు. అధికారులు బదిలీలు కావడంతో కొత్తగా వచ్చిన సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలు తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు. - మక్తల్

పస్పుల ఘాట్‌ను తాకిన వరద



మక్తల్: మండలంలోని పస్పుల ఘాట్ వరకు కృష్ణా నది నీటి మట్టం చేరుకుంది. కర్ణాటకతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో కృష్ణా నదిలో నీటి మట్టం రోజురోజుకు పెరుగుతుంది. ఈ క్రమంలో తాజాగా వరద పస్పుల ఘాట్‌ను తాకింది. కృష్ణా నదిలో నీటి మట్టం అధికంగా ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కృష్ణావేని విగ్రహం వరకు వరద నీరు చేరుకోవడంతో దత్తక్షేత్రంలోకి నీరు ప్రవేశించే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

మాగనూర్: మండలంలోని వర్కూర్ గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు, విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలం కావడంతో విద్యార్థులు వాగులు, వంకలు దాటి పాఠశాలలకు వెళ్లాల్సి వస్తుంది. బస్సు సౌకర్యం లేకపోవడంతో సమయానికి పాఠశాలకు చేరుకుంటామోలేదోనని ఉదయం తినకుండానే పాఠశాలలకు నడుచుకుంటూ వెళ్తూ అవస్థలు పడుతున్నారు. ఇక వానకాలంలో అయితే మరిన్ని ఇబ్బందులు తప్పడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

మున్సిపాలిటీ సిబ్బంది సహాయక చర్యలు



మక్తల్: ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు జలమయమయ్యాయి. అలాగే పట్టణంలోని శ్రీరామ్ నగర్, అంబేద్కర్‌నగర్, యల్లమ్మ కుంటలో వరద నీరు రావడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ కాలనీల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు. అదే విధంగా రుద్రసముద్రం దగ్గర బిడ్జిపై నుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో జేసీబీ సాయంతో సహాయక చర్యలు చేపట్టి సాధ్యమైనంత మేర ఇబ్బందులు తొలగించారు.

బోరు బావికి భూమిపూజ

దామరగిద్ద: మండలంలోని బాపన్‌పల్లి గ్రామంలో స్థాని భీమశంకర్ దేవాలయ ఆవరణలో బోరుబావిని తవ్వించేందుకు దాత భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువా పూల దండలతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం రాజ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు తిప్పణ్ణ, మధు, నర్సింములు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేతన్నల అభ్యున్నతికి పెద్దపీట



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

ధన్వాడ: కాంగ్రెస్ ప్రభుత్వం చేనేతల అభ్యున్నతికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రుమండ్లరాంచంద్రయ్య భవనంలో చేనేత కార్మికులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేనేతల సంక్షేమానికి కృషి చేస్తుందని, ఇప్పటికే చేనేతలకు రుణమాఫీ చేసిందని అలాగే నేతన్న చేయూత పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా ఆమె అభిమానులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నేత కార్మికుడు పేడుముతి గోపికృష్ణ మొగ్గంపై ఆమె చిత్రపటాని తీర్చిదిద్ది ఆమెకు బహుమతిగా అందజేశారు. అనంతరం సంతబజారులో చౌరస్తాలో ఏర్పాటు చేయనున్న మహాత్మగాంధీ విగ్రహం అలాగే శివాజీ విగ్రహాల ప్రతిష్ఠాపన కోసం భూమి పూజ చేశారు. కొండాపూర్ వద్ద ఉన్న చిన్నవాగు ఉధృతంగా పారుతుండడంతో పంచాయతీ సిబ్బందితో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. సింగిల్ విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రుణాలు త్వరితగతిన మంజూరు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: ప్రాధాన్యత రంగాలైన అగ్రికల్చర్, ఎంఎస్ ఎంఈ, అగ్రికల్చర్, ఎన్ఆర్ఎల్ఎం, పీఎంఈజీపీ పథకాల కింద త్వరితగతిన రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో నిర్వహించిన డీసీసీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బ్యాంకర్లు వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి సకాలంలో రుణాలు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ విజయ్ కుమార్ వార్షిక ప్రణాళిక 2025–26 జూన్–25తో ముగిసిన తొలి ఆర్థిక త్రైమాసికం సంవత్సరానికి రూ.4204.49 కోట్ల బడ్జెట్‌కు గాను రూ.809.25 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. మొత్తం ప్రాధాన్యత రంగాలకు రూ.3833.48 కోట్ల వరకు రుణాలు మంజూరు చేయాలని రుణ ప్రణాళికను నిర్దేశించారు. సమావేశంలో నాబార్డు డీడీఎం షణ్ముఖ చారి, ఎస్.బీ.ఐ సీఎం క్రెడిట్ జఫ్ఫార్ మొయినుద్దీన్, టిజీబి రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, యూబీఐ ఏటీఎం మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. మంగళవారం నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె సందర్శించి స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని విభాగాలను పరిశీలించి వైద్యులతో వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని సూచించారు.

పెండింగ్ వేతనం విడుదల చేయండి



నారాయణపేటలో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

నారాయణపేట/నారాయణపేట రూరల్: ఆశా కార్యకర్తలకు పెండింగ్ వేతనం విడుదల చేయాలని, ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు అమలు చేయాలని జిల్లా ఆశావర్కర్స్ యూనియన్ సభ్యులు కోరారు. యూనియన్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మంగళవారం జిల్లా ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణ ఆరోగ్య కేంద్రం ముందు ధర్నా చేపట్టి అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ అధికారి డాక్టర్ నరసింహ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ప్రతి నెల రెగ్యులర్‌గా పారితోషికం అందజేయాలన్నారు. అలాగే రూ.50 లక్షల ఇన్సూరెన్స్, అంత్యక్రియలకు రూ.50 వేలు ఇస్తామన్న హామీని అమలుచేయాలన్నారు. తమ డిమాండు సాధనకు ఆగస్టు 25న కలెక్టరేట్ల ముందు ధర్నా చేపడతామని అప్పటికి ప్రభుత్వం స్పందించని పక్షంలో సెప్టెంబర్ 1న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ధర్నాలో యూనియన్ నాయకులు ఉమాదేవి, నిర్మల, హైమావతి, వీ రాధిక, లక్ష్మి, భాగ్య, లలిత శివమ్మ, భాగ్య, సునీత రాధిక, కల్పన తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

మాగనూర్: ఆశా వర్కర్లకు జూలై నెల జీతం విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుంజనూర్ ఆంజనేయులు కోరారు. ఈ మేరకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దగ్గర ధర్నా నిర్వహించి మండల ఇన్‌చార్జి వైద్యాధికారి సమీనాకి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు అనురాధ, ఆనంతమ్మ, సరిత, రేణుక, శివమ్మ, ఆశమ్మ, మల్లమ్మ, మహాదేవమ్మ, శృతి, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత పెంచేలా బోధన ఉండాలి



ఊట్కూరులో టీఎల్ఎం మేళా



మాట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు

దామరగిద్ద: విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన ఉండాలని డీఈఓ గోవిందరాజులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీఎల్ఎం మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మెరుగైన విద్యకు టీఎల్ఎం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అంతకుముందు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తయారు చేసి ప్రదర్శించిన బోధనోపకరణలను తిలకించారు. కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ అధికారి నాగార్జున్‌రెడ్డి, ఏఎంఓ విద్యాసాగర్, ఎస్ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జ్ఞాపకశక్తి పెంపు

కోస్గి రూరల్: బోధనాభ్యసన సామగ్రి ద్వారా పాఠ్యాంశాలను బోధించడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచుతాయని ఎంఈఓ విద్యాసాగర్, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ వార్లవిజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏబీకే ఫంక్షన్ హాల్లో గుండుమాల్, కోస్గి మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల మండల స్థాయి బోధనాభ్యసన సామగ్రి మేళా నిర్వహించగా వారు పాల్గొని పలు సూచనలు చేశారు.

ఆకట్టుకున్న టీఎల్ఎం మేళా

ఊట్కూరు: ఊట్కూరు బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులు నిర్వహించిన టీఎల్ఎం మేళా ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు తెలుగు, గణితం, ఆంగ్లం తదితర సబ్జెక్ట్‌లపై తక్కువ ఖర్చుతో విద్యార్థులకు బోధించే సామగ్రిని తయారు చేసి ప్రదర్శించారు. ఈ సామగ్రితో విద్యార్థులు సులభంగా, స్వయంగా నేర్చుకోవడానికి ఉపయోగపడేవిదంగా తయారుచేశారు. వివిధ పాఠశాలల విద్యార్థులు టీఎల్ఎం మేళాలో పాల్గొని తిలకించి అనుమానాలు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మాధవి, జిహెచ్ఎం గౌరమ్మ, ఉపాధ్యాయులు నర్సింగప్ప, గురునాథ్, కిరన్ తదితరులు పాల్గొన్నారు.

బోధనాభ్యాస సామగ్రి ప్రదర్శన

మద్దూరు: మండల స్థాయి బోధనభ్యాసన సామగ్రి మేళా పట్టణంలోని షా గార్డన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. మేళాను మండల విద్యాధికారి బాలకృష్ణప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ప్రదర్శనలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఉపాధ్యాయులందరూ బోధనాభ్యస సామగ్రిని ప్రదర్శించారు.

టీఎల్ఎంతో అనేక ప్రయోజనాలు

నర్వ: టీఎల్ఎం మేళా విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంఈఓ రాంరెడ్డి అన్నారు. పాథర్చేడ్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన టీఎల్ఎం మేళాలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులు, విద్యార్థులు, తయారు చేసిన అనేక దృశ్య, శ్రావణ, అభ్యాసన ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం ప్రాధాన్యత కలిగిన వాటిని ఎంపిక చేసి ప్రశంసాపత్రంతో పాటు మెమోంటో అందజేశారు.

అండర్ పాస్‌కు మరమ్మతు చేపట్టాలి



వంతెన వద్ద నిలిచిన వర్షపు నీరు

మాగనూర్: మండల కేంద్రంలోని నూతన రైల్వేస్టేషన్ సమీపంలోని కొత్తపల్లి రహదారిపై నిర్మించిన రైల్వే అండర్ పాసు వంతెనలో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెన కింద భాగంలో ఒక సైడ్‌లో వర్షపు నీరు నిలవడం, ముందు భాగంలో గుంతలు ఏర్పడి అందులోనూ నీరు నిలువడంతో ఎటు నుంచి వెళ్లాలో అర్థం కావడం లేదని అంటున్నారు. ప్రమాదాలు సంభవించకముందే సంబంధిత అధికారులు వంతెన దగ్గర మరమ్మతు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.